మల్లూరు ఆలయ రికార్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్

మంగపేట, జూన్ 12 : మొక్కుబడి కింద భక్తులు సమర్పించిన రెండు కోడెలను ఆలయ రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఇతర మతస్తుడికి విక్రయించడంపై బుధవారం ఆయనకు ఈవో మహేశ్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు రెండు కోడెలను సమర్పించారు. ఉత్సవాల అనంతరం నిబంధనల ప్రకారం రూ.7వేలకు వేలం వేయొచ్చని ఆలయ సిబ్బంది ప్రకటించారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి రూ 5 వేలకు పాట పాడాడు. సరైన పాట రాకపోవడంతో మరోసారి వేలం నిర్వహించగా రూ 5,500 వేలం వరకు రావడంతో వాయిదా పడింది. ఇదిలా ఉంటే కమలాపురానికి చెందిన ఓవ్యక్తి ఈనెల 11న రూ.7800 కోడెలు కొనుగోలు చేసేందుకు ముందుకు రాగా, మంచి ధర వచ్చిందని భావించిన రికార్డ్ అసిస్టెంట్ వాటిని అమ్మి రసీదు ఇచ్చాడు. అయితే కోడెలు కొనుగోలు చేసిన వ్యక్తి ఇతర మతస్తుడు కావడంతో భక్తుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కొందరు ఆలయ సిబ్బందిని నిలదీయడంతో వాటిని తిరిగి దేవస్థానానికి తెప్పించారు. ఈ వ్యవహారంపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని రికార్డు అసిస్టెంట్‌కు ఈవో షోకాజ్ నోటీసు ఇచ్చారు.

భూపాలపల్లి జిల్లాలో ఎన్పీడీసీఎల్ సీఎండీ పర్యటన

చెన్నాపూర్‌లో సబ్‌స్టేషన్ పనులు పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డి

కృష్ణకాలనీ, జూన్ 12 : జిల్లాలోని పలు మండలాల్లో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం పర్యటించారు. రేగొండ మండలంలో నిర్మించనున్న 33/11 కేవీ చెన్నాపూర్, చిట్యాల మండలంలోని నైన్‌పాక సబ్‌స్టేషన్ల పనులను పరిశీలించి వాటి పురోగతిని తెలుసుకున్నారు. అలాగే కొత్తగా నిర్మించనున్న ఒడితల సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. జిల్లాలోని అన్ని 33/11కేవీ సబ్ స్టేషన్లకు 33కేవీ మెయిన్ ఫీడర్‌తో పాటు మరో ప్రత్యామ్నాయ ఫీడర్ కూడా ఉండాలని ఆయన సూచించారు. ఏదైనా అనుకోని సమయంలో మెయిన్‌లో సమస్య వస్తే ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కొత్తగా కనెక్షన్ తీసుకునే వ్యవసాయ వినియోగదారులకు పనులు పూర్తి చేసి, సర్వీసులను రిలీజ్ చేయాలన్నారు. ఆయన వెంట భూపాలపల్లి జిల్లా ఎస్ఈ మల్చూర్ నాయక్, డీఈ నాగరాజు, కన్‌స్ట్రక్షన్ అండ్ ఎంఆర్‌టీ డివిజనల్ ఇంజినీర్ ఎన్ సదానందం, ఏడీఈలు, ఏఈలు ఉన్నారు.

బాలసదనాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

ములుగు రూరల్, జూన్ 12 : త్రైమాసిక తనిఖీల్లోభాగంగా జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని డీపీసీ బృందం సభ్యులతో కలిసి అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ బుధవారం సందర్శించారు. వారితో ఆయన సమావేశం ఏర్పాటు చేసి బాలలకు అందుతున్న సౌకర్యాలపై చర్చించారు. ఇతర జిల్లాలలో ఉన్న బాలలను ములుగు బాల సదనానికి రప్పించి ప్రవేశాలను కల్పించాలన్నారు. వంట కార్మికులతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీడబ్ల్యూవో స్వర్ణలత, డీపీసీ మెంబర్లు పింగిలి నాగరాజు, ఓంకార్, శ్రీకాంత్, నమ్రత, రాజు ఉన్నారు.

భూములు కబ్జా కాకుండా చూడాలి

చిట్యాల, జూన్ 12 : తమ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని చైన్‌పాక శివారు రాఘవపూర్ బాధిత రైతులు తహసీల్దార్ మొయినుద్దీన్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. చైన్‌పాక గ్రామానికి చెందిన పలువురు తమ భూములను అక్రమంగా పట్టాలు చేసుకుని కాస్తులో ఉన్న వారిపై భౌతిక దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొప్పుల శ్రీనివాస్, శంకర్, బుదారపు రమేశ్, కమ్మంపాటి బతుకమ్మ, వెంకట్రాములు, పెద్దా రాయబోస్, దామరశెట్టి మహేందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఇసుక క్వారీలపై చర్యలు తీసుకోవాలి

మంగపేట, జూన్ 12 : మండలంలో పొదుమూరు, మల్లూరు, వాడగూడెం, రాజుపేట ఇసుక క్వారీల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని జాతీయ గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలను తొలగించేందుకు స్థానిక ట్రాక్టర్ ద్వారా లోడ్ చేసి డంప్ చేయాల్సి ఉండగా, టీఎస్ఎండీసీ శాఖ పర్యవేక్షణ లేక క్వారీ నిర్వాహకులు జేసీబీలు పెట్టి టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్నారు. అదనపు బకెట్లు వేసి లక్షలాది రూపాయల అక్రమార్జన చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న ఇసుక క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాల అందజేత

గణపురం : విద్యార్థినికి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేశ్‌మిశ్రా

గణపురం/ భూపాలపల్లి రూరల్, జూన్ 12: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యాబోధన అందుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. బుధవారం గణపురం మండలం మైలారం పాఠశాల, భూపాలపల్లి మండలం జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుదొడ్ల నిర్మాణాలు, హ్యాండ్ వాష్ ప్లాట్‌ఫారాలు, మంచినీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కోసం పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేరితే ఫీజులు లక్షల్లో కట్టాల్సి ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి డబ్బును ఆదా చేసుకొని, ఉన్నత చదువులకు ఉపయోగించుకోవాలని సూచించారు. 'మీ డబ్బులు మీ దగ్గరే.. మీ పిల్లల భవిష్యత్తు మా దగ్గర' అంటూ బడిబాట కార్యక్రమంలో విస్తృతంగా ప్రచారం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉదయం రాగి జావ, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ తరగతులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠశాలలను కాపాడుకునేలా అందరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. యూనిఫామ్ కొలతలు తీసుకొని ఆ ప్రకారమే మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టించామని తెలిపారు. ఈ కార్యక్రమల్లో డీఈవో రాంమ్‌కుమార్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, ఎంపీడీవో భాస్కర్, ఏఎంవో లక్ష్మణ్, పంచాయతీరాజ్ ఏఈ, డీఈలు పాల్గొన్నారు.

వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

టేకుమట్ల, జూన్ 12 : టేకుమట్ల- రాఘవారెడ్డిపేట గ్రామాల మధ్య వంతెన పునర్ నిర్మాణ పనులు వేగంగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఆదేశించారు. బుధవారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వంతెన తెగడం వల్ల వాగు అవతలి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో పునర్ నిర్మాణం కోసం 4.70 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాలు ప్రారంభం కాక ముందే పనులు పూర్తి చేయాలన్నారు. చలివాగులోని ఇసుకను ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు విక్రయించేందుకు ఆర్అండ్‌బీ అధికారులకు దేశాలు ఇస్తున్నామన్నారు. ఇందుకోసం చలివాగులోని 200 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న ఇసుక రీచ్ ఏర్పాటుకు ప్రైవేట్ భూమిని అద్దెకు తీసుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథ ఇంటింటా సర్వే పరిశీలన

మండల కేంద్రంలో జరుగుతున్న మిషన్ భగీరథ ఇంటింటీ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందితో కలిసి ఆయన ఓ కుటుంబాన్ని స్వయంగా సర్వే చేశారు. సోమవారం ప్రారంభమైన ఈ సర్వే జిల్లా వ్యాప్తంగా 24 గ్రామాల్లో కొనసాగుతుందని 10 రోజుల్లో ఈ పూర్తి చేసి, ప్రత్యేక యాప్‌లో వివరాలు పొందుపర్చనున్నట్లు చెప్పారు. సర్వే ద్వారా ప్రతి ఇంటిని కవర్ చేసి, సర్వే తర్వాత చనిపోయిన వారి వివరాలు, వలస వెళ్లిన వారి వివరాలతో నివేదిక తయారు చేసి అందజేయాలని సర్వే బృందాలు, అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల ఎస్వో శైలజ, ఆర్అండ్‌బీ డీఈ రమేశ్, ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేశ్, కార్యదర్శి సాంబశివుడు ఉన్నారు.

బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న దామోదర్‌స్వామి

ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి

ఏటూరునాగారం, జూన్ 12 : మండల కేంద్రంలోని గిరిజన బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలను బుధవారం ప్రత్యేకాధికారి, ఐటీడీఏ ఏవో దామోదర్‌స్వామి బుధవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిశీలించారు. స్నానపు గదులు, టాయిలెట్స్‌కు నీటి సరఫరా, ఫ్లోరింగ్, తాగునీటి ఇబ్బందులు, లైటింగ్, ఫ్యాన్లు, విద్యుత్ సమస్యలను పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్, స్నానపు గదుల వివరాలను సేకరించారు. కిటికీలకు తలుపులు లేకపోవడం, దోమ తెర ఏర్పాటు చేయాలని దామోదర్‌స్వామికి హెచ్ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వివరించారు. ఇక్కడ 83 ఫ్యాన్లు ఉండగా 23 పనిచేయడం లేదన్నారు. 16 ట్యూబ్‌లైట్లు పనిచేయడం లేని తెలిపారు. 32 స్నానపు గదులుండగా 16 వినియోగంలో ఉన్నట్లు తెలిపారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో నిత్యావసర సరకుల విషయమై ఆరా తీయగా గత విద్యా సంవత్సరం సరఫరా చేసిన స్టాకు కొంత నిల్వ ఉందని వాటిని ఉపయోగించుకుంటామని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీలత తెలిపారు. వాటర్ ట్యాంకు లీకేజీ, సోలార్ వాటర్ హీటర్ల పైపులు పగిలి లీకేజీ ఉందన్నారు. బాలుర ఆశ్రమ పాఠశాలలో పనిచేయని టాయిలెట్స్‌ను పరిశీలించారు. 13ఫ్యాన్లు, 12 ట్యూబ్ లైట్లు పనిచేయడం లేదని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజ్ కుమార్ తెలిపారు. స్నానపు గదులు, టాయిలెట్స్‌కు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, తలుపులు కూడా లేకపోవడాన్ని గుర్తించారు. కంప్యూటర్ల గదిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ నిత్యావసర సరుకులు లేవని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ తెలిపారు. అయితే ఈ రెండు పాఠశాలల్లో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఎం రేవతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు శ్రీలత, మనోజ్‌కుమార్‌ను ఆదేశించారు. తక్షణమే పనులు పూర్తి చేయించాలని సమస్యలను పీవో దృష్టికి తీసుకుపోనున్నట్లు వెల్లడించారు. కాగా, పాఠశాలలు, హాస్టల్స్‌లో వసతి సౌకర్యాలు కల్పించడంలో భాగంగా తాగునీటి లీకేజీలు, ఫ్లంబింగ్ పనులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల మరమ్మతు, ఆవరణలో లైట్లు ఏర్పాటు చేసుకోవడం, టాయిలెట్స్‌లో చిన్న మరమ్మతుల కోసం ఒక్కో పాఠశాల, హాస్టల్‌లో ఖర్చు చేసేందుకుగాను రూ. 20 వేల చొప్పున కేటాయించారు.

విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి : డీఏవో

ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న డీఏవో విజయ్‌చందర్, ఏవో

మంగపేట, జూన్ 12 : వానకాలంలో విత్తనాలు, ఎరువుల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని డీఏవో విజయ్‌చందర్ సూచించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను బుధవారం ఆయన ఏవో చేరాలుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆమోదిత విత్తన కంపెనీలకు చెందిన విత్తనాలనే రైతులకు విక్రయించాలని, ఎరువులు, పురుగు మందుల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలన్నారు. బిల్లు బుక్కులు, స్టాకు, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. అమ్మకాల్లో నిబంధనలు పాటించని వ్యాపారులపై వ్యవసాయ శాఖా పరమైన చర్యలుంటాయని డీఏవో హెచ్చరించారు.

బీసీ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, జూన్ 12 : భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ ప్రీ మెట్రిక్ బీసీ వసతి గృహాల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు జూన్ 30లోగా www.bchostels.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గణపురం బాలికల హాస్టల్‌లో 43 సీట్లు, చిట్యాల (బాలురు) 49 సీట్లు, మొగుళ్లపల్లి (బాలురు) 26 సీట్లు, మహదేవ్‌పూర్ బాలురు) 64 సీట్లు, మహాముత్తారం బాలుర వసతి గృహంలో 70 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కులం, ఆదాయం, స్టడీ, బోనాఫైడ్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ఫారం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, 3 ఫొటోలు జత చేసి సంబంధిత వసతి గృహాల సంక్షేమాధికారులకు అందజేయాలని తెలిపారు.

బడికి పంపించాలి

వాజేడు, జూన్ 12 : పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో బడీడు పిల్లలను స్కూళ్లకు పంపాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మొరుమురు గ్రామంలో సీఆర్పీఎఫ్ పోలీసు బలగాలతో కలిసి కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్ నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున వరద ముంపు వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జగన్నాథపురం వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనలు ఆపి తనీఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ములుగురూరల్, జూన్12 : బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సూర్యచంద్రకళ, జడ్జి, న్యాయవాధికార సంస్థ కార్యదర్శి కన్నయ్యలాల్ బాల కార్మిక నిరోధక చట్టం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో స్వర్ణలత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద, డీసీపీవో ఓంకార్, సీడీపీవో స్వాతి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఏపై చర్యలు తీసుకోవాలి

ములుగురూరల్, జూన్12 : పత్తిపల్లి గ్రామంలోని సంజన మహిళా పొదుపు సంఘం సీఏగా పనిచేస్తున్న బుర్రి ధనలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం మహిళలు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2021లో సంఘానికి మంజూరైన రూ.70వేలు తాము తీసుకోకుండా అప్పులో జమ చేయాలని చెప్పగా ధనలక్ష్మి డిపాజిట్ ఓచర్‌కు బదులు విత్‌డ్రా ఓచర్‌పై గ్రూపు లీడర్లతో సంతకం చేయించుకొని సొంతానికి వాడుకుందని తెలిపారు. నిరక్షరాస్యులైన తమను మోసం చేసి సీఏ డబ్బులు కాజేసిందని పేర్కొన్నారు. అడిగినప్పుడల్లా అప్పుగా జమ చేశానని చెప్తూ దాటవేస్తున్నదన్నారు. ఇటీవల బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసి చూడగా డిపాజిట్‌కు బదులు విత్‌డ్రా చేసుకున్నట్లు తేలిందన్నారు. సదరు సీఏపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సంఘ మహిళా సభ్యులు కోరారు.

మేడిగడ్డలో మరమ్మతులు

మహదేవపూర్, జూన్ 12 : లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌లో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. బరాజ్‌లో ఏడో బ్లాక్ వద్ద జరుగుతున్న పనులను భారీ నీటిపారదల శాఖ ఈఈ తిరుపతిరావు బుధవారం పరిశీలించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన పియర్‌ల వద్ద గ్రౌటింగ్ పనులు జరుగుతున్నాయి. బరాజ్‌లో మొత్తం 85 గేట్లకు 81 గేట్లు ఎత్తగా మిగతా నాలుగు గేట్లను ఎత్తాల్సి ఉంది. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకను యంత్రాలతో సాయంతో తొలగిస్తున్నారు. బరాజ్ దిగువన సీసీ బ్లాక్‌ల రీఅరెంజ్‌మెంట్ పనులు చేపడుతున్నారు. బరాజ్ దిగువన భారీ వరద ప్రవాహానికి ఇసుక కొట్టుకపోకుండా కాపర్ షీట్ ఫైల్స్‌ను అమర్చుతున్నారు. సీఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల పరిశోధనలు కొనసాగుతున్నాయి.

బరాజ్‌లో జరుగుతున్న మరమ్మతు పనులు

కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

ములుగురూరల్/ మంగపేట, జూన్ 12 : ములుగు, మంగపేట మండలాల్లోని కార్యకర్తల కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అండగా నిలిచారు. అబ్బాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఆరెల్లి రవి ఇద్దరు కుమారులు జనటిక్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకొని పార్టీ మండల కో ఆర్డినేటర్ పాలెపు శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం రూ.40 వేలు, రూ.5 వేల విలువ చేసే మందులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యకర్తలు, వారి కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరెందుల రాధికా కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉయ్యాల రాజన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు భూక్యా రతన్‌సింగ్ తండ్రి భీమ్‌సింగ్ ఇటీవల మృతి చెందగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు సూచన మేరకు సీనియర్ నాయకుడు తాటి కృష్ణ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎగ్గడి అర్జున్, గాదె శ్రీనివాసాచారి, చిలకమర్రి రాజేందర్, జాడి రాంబాబు, దీగొండ బాబు, ఎర్రంసింగ్, వెంగయ్య, పాల్తియా వెంకట్రామ్, భూక్యా భీమ్‌సింగ్, బీ చంద్రం, దుర్గం నర్సింహారావు, కావేరి నారాయణ, గోమాసు మాణిక్యం, ముప్పారపు సందీప్, ముత్తెబోయిన నర్సింహారావు, వేమునూరు మోహన్‌రావు, మద్దిరాల నర్సింహమూర్తి, తిమ్మంపేట సోషల్ మీడియా ఇన్‌చార్జి పూజారి సతీశ్ పాల్గొన్నారు.

మంగపేట : ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నేత కుటుంబానికి పరామర్శ

గోవిందరావుపేట : బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చుక్క గట్టయ్య కుటుంబాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అజ్మీరా ధరమ్‌సింగ్ పరామర్శించారు. గట్టయ్య తల్లి కనకమ్మ కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. మంగళవారం గ్రామానికి వచ్చి సంతాపం ప్రకటించి క్వింటాల్ బియ్యం అందించారు. ఆయన వెంట ఎంపీటీసీ అలూరి శ్రీనివాస్, మండల కో ఆర్డినేటర్ లకావత్ నర్సింహనాయక్, నాయకులు పెన్నింటి మధుసూదన్‌రెడ్డి, పూర్ణచందర్, పృథ్వీరాజ్, మల్లేశ్, సురేశ్, మోహన్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్, సంజీవ, కనకయ్య, వెంకన్న, విజయ్ ఉన్నారు.

విద్యాశాఖ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మోడల్ స్కూల్ పరిశీలన

ములుగురూరల్, జూన్ 12 : బండారుపల్లి మోడల్ పాఠశాలను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. నేడు విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌ల పంపిణీకి మంత్రి సీతక్క హాజరవుతున్న సందర్భంగా ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట డీఈవో పాణిని, సైన్స్ అధికారి జయదేవ్, ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

ములుగు, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి రాజూనాయక్ అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీఈవో పాణిని ఏకపక్షంగా వ్యవహరిస్తూ కొన్ని సంఘాలకు మాత్రమే సహకరిస్తున్నారని ఆరోపించారు. బుధవారం డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలపై నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశానికి అన్ని సంఘాలకు సమాచారం అందించలేదన్నారు. ఇదే విషయమై గిరిజన ఉపాధ్యాయ సంఘం తరుపున తాను ప్రశ్నించగా జిల్లాలో ఉన్న ఉపాధ్యాయ సంఘాలు అన్ని నాకు ఎలా తెలుస్తాయని అవమానించేలా మాట్లాడారని వాపోయారు. బదిలీల్లో ఉపాధ్యాయులకు ఎలాంటి అన్యాయం జరిగినా తమ సంఘం పోరాటాలు చేస్తుందన్నారు.

మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌కు సన్మానం

కృష్ణకాలనీ, జూన్ 12 : భూపాలపల్లి మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన నూనె రాజుపటేల్‌ను చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కం రవికుమార్, ముంజంపెల్లి మురళీధర్, మాడ కమలా లక్ష్మారెడ్డి, నాగుల శిరీషా దేవేందర్‌రెడ్డి, ఎడ్ల మౌనికా శ్రీనివాస్, మేకల రజితా మల్లేశ్, ఆకుదారి మమతా రాయమల్లు, బానోత్ రజితా జుమ్మలాల్, బద్ది సమ్మయ్య, కన్నం యుగదీశ్వర్, ధార పూలమ్మ, బీఆర్ఎస్ నాయకులు మాడ హరీశ్‌రెడ్డి, కవ్వంపెల్లి శేఖర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి చేయూత

వాజేడు, జూన్ 12 : మండలంలోని పెద్దగంగారం గ్రామానికి చెందిన ఆలం వెంకటేశ్వర్లు, కమల దంపతుల ఆరు నెలల కుమార్తె అనారోగ్యంతో హనుమకొండలో చికిత్స పొందుతున్నది. వైద్యం కోసం తల్లిదండ్రులు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఇంకా రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలుపడంతో తల్లిదండ్రులు దాతల సాయం కోరారు. చంద్రుపట్ల గ్రామానికి చెందిన బుద్దె ప్రసాద్, ఆకుల మధుమోహన్, మహేశ్ ద్వారా విషయం తెలుసుకున్న వెంకటాపురం మండలానికి చెందిన చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు చిడెం సాయిప్రకాశ్ దాతల సహకారంతో రూ.50,200 సేకరించారు. దానిని హనుమకొండకు వెళ్లి చిన్నారి తల్లిదండ్రులకు బుధవారం అందజేశారు. మరికొంత మంది దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఎన్నికష్టాలు వచ్చినా చదువు ఆపొద్దు

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి రూరల్, జూన్ 12 : ఎన్నికష్టాలు వచ్చినా పిల్లల చదువును ఆపొద్దని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి అన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలన్నారు. బాలలకు న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేన్ అధ్యక్షుడు కే సురేశ్‌కుమార్, కార్యదర్శి బల్లా మహేందర్, రవీందర్, అక్షయ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి రూరల్, జూన్ 12 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దవాఖానల్లో వైద్య సేవలపై వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానన్నారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కొమురయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజు డేవిడ్ పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం (నూగూరు), జూన్ 12 : వసతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వంశీ అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్వాలిఫైడ్ టీచర్లను సైతం నియమించలేదని ఆరోపించారు. నాయకులు అశోక్, మోహన్, సిద్ధు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు

గణపురం, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నదని వైస్ఎంపీపీ విడిదినేని అశోక్, ఎంపీటీసీ శివ శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి వారు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5116 చొప్పున నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. హెచ్ఎం దేసు సతీశ్‌కుమార్, భరత్‌కుమార్, కుమారస్వామి, శకీరా బేగం, రాంబాబు, రమేశ్, శ్రీనివాస్, స్వామి, దేవేందర్, సదానందం, సత్యనారాయణ, ముస్తాక్, హేమలత పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ సమ్మయ్య బుధవారం పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కళ, హెచ్ఎం జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో కరెంట్ బిల్లుల చెల్లింపు

ములుగు రూరల్, జూన్ 12 : ములుగు సర్కిల్ విద్యుత్ వినియోగదారులకు అందించే కరెంట్ బిల్లుపై క్యూఆర్ కోడ్‌తో ఆన్‌లైన్‌లో కరెంట్ బిల్లులు చెల్లించే సదుపాయాన్ని కల్పిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ బీ మల్చూర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ బిల్లులపై క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేస్తే బిల్లు వివరాలు, చెల్లించాల్సిన మొత్తం ఫోన్‌లో కనిపిస్తుందన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

CHANGE OF NAME
I Smt. J.PAVANI W/o Ex.No. 14614917W (SEPOY) JEEGURU KUMAR SWAMY R/o H.No. 5-11-429/2, Naimnagar, Post: Vill: Hanumakonda Dist. T.S, PIN: 506 009. I have changed my name J. PAVANI to JEEGURU PAVANI India Solemnly declare.

CHANGE OF NAME
I JEEGURU KUMAR SWAMY S/o KOMARAIAH Ex.No. 14614917W (SEPOY) R/o 5-11-429/2, Naimnagar, Post Vill: Hanumakonda Dist. T. S, PIN: 506009 my minor Daughter name is changed from SHIVANI to J SHIVANI India Solemnly declare.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

WANTED
★ జనగామ జిల్లా కేంద్రంలో జూనియర్ కళాశాలలో విద్యార్థులను అడ్మిషన్స్ చేయడానికి PRO's & Lecturers కావలెను @ 9515137392.
NTW-5699

కావలెను
★HIV Prevention Programలో పని చేయుటకు అనుభవం గల Female GNM & ORWలు కావలెను. Send your Resume on or before 15/6/2024, rdmm.wgl@gmail.com, Cont: 9849688581, 9959711470.
NTW-323319

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565